సాక్షి ఖమ్మం
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



ముగిసిన గ్రూప్‌-2 పరీక్షలు

జిల్లాలోని 85కేంద్రాల్లో రెండు రోజుల పాటు రెండేసి సెషన్లలో జరిగిన గ్రూప్‌–2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 8లో



ప్రభుత్వానిది తప్పుడు ప్రచారం

రైతు రుణమాఫీపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు హేమంతరావు ఆరోపించారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 14°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం మంచు ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదైనా రాత్రికి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్‌

'సీతారామ' ఆయకట్టుపై సర్వే



కలెక్టరేట్‌ సమీపాన సర్వే చేస్తున్న ఏజెన్సీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్‌: సీతారామ ప్రాజెక్ట్‌ ద్వారా జిల్లాలో సాగులోకి వచ్చే ఆయకట్టును శాస్త్రీయంగా నిర్ధారించేందుకు ప్రైవేట్‌ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన గ్లోబల్‌ ఇంజనీరింగ్‌ ఏజెన్సీకి ఈ బాధ్యతలు అప్పగించగా రఘునాథపాలెం మండలం వి.వి.పాలెంలో కలెక్టరేట్‌ సమీపాన సోమవారం సర్వే చేపట్టారు. సీతారామ ప్రాజెక్ట్‌ కాల్వలను ఏ స్థాయిలో తవ్వితే ఎంత ఆయకట్టుకు నీరందుతుందో గుర్తించేందుకు సర్వే చేస్తున్నామని ఏజెన్సీ బాధ్యులు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.

పాలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లో



పాలేరు రిజర్వాయర్‌

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. వారం క్రితం 13.85 అడుగులుగా ఉన్న నీటిమట్టం సోమవారానికి 15.65 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌కు సాగర్‌ నుండి నీటి సరఫరాను రెండు రోజుల క్రితం 4,550 క్యూసెక్కులకు పెంచగా నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఇక రిజర్వాయర్‌ నుండి ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టుకు 2,621 క్యూసెక్కులు, పాలేరు కాల్వకు 150 క్యూసెక్కులు, భక్త రామదాసు ప్రాజెక్టుకు 275 క్యూసెక్కులతో పాటు మిషన్‌ భగీరథకు 125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే, ఔట్‌ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో 1,379 క్యూసెక్కులు ఎక్కువగా ఉండడంతో నీటిమట్టం మరింత పెరగనుందని భావిస్తున్నారు. జిల్లాలో యాసంగి పంటలకు సాగునీటిని వారబందీ విధానంలో విడుదల చేయనుండగా రిజర్వాయర్‌లో నీటిమట్టాన్ని 20 అడుగులుగా క్రమబద్ధీకరించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి

ఖమ్మంఅర్బన్‌: ఆరోగ్యవంతమైన సమాజం ద్వారానే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని అందరూ గ్రహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ కళావతిబాయి సూచించారు. జిల్లా మహిళా ప్రాంగణంలో స్కూల్‌ హెల్త్‌ అండ్‌ వెల్‌నెస్‌ ప్రోగ్రాంపై జిల్లా రిసోర్స్‌ పర్సన్లకు ఇవ్వనున్న శిక్షణను విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్‌తో కలిసి ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో శిక్షణ పూర్తికాగా, ప్రతీ మండలం నుంచి రెండు శాఖల్లో ఎనిమిది మంది ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు కౌమార దశలో ఉన్న విద్యార్థుల్లో శారీరక మార్పులను వివరిస్తూ దురలవాట్ల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. అంతేకాక ప్రతీ విద్యార్థి ఆరోగ్య రికార్డులు నమోదుచేయాలన్నారు. ఇదేసమయాన శారీరక, మానసిక లోపాలు ఉన్న వారిని గుర్తిస్తే వారికి ప్రత్యేక విద్యాప్రణాళిక అమలు చేయడం సాధ్యమవుతుందని చెప్పారు. కాగా, ప్రశస్త్‌ యాప్‌ ద్వారా రెండో దశలో దివ్యాంగుల వివరాల సేకరణ జరుగుతోందని, తద్వారా వారికి ప్రత్యేక ఉపకరణాలు అందించడం, శస్త్రచికిత్స చేయించడంతో పాటు సదరం సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో స్టేట్‌ రిసోర్స్‌ పర్సన్స్‌ డాక్టర్‌ చందన, డాక్టర్‌ స్రవంతి, డాక్టర్‌ బాలకృష్ణ, పెసర ప్రభాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పోలింగ్‌ స్టేషన్ల తుదిజాబితా విడుదల

ఖమ్మంవన్‌టౌన్‌: గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారులు ఏర్పాట్లలో వేగం పెంచారు. ఇటీవల జిల్లాలోని 589 గ్రామపంచాయతీల్లో వార్డులు, జీపీల వారీగా ఓటర్ల తుది జాబితాలు ప్రకటించారు. అలాగే, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా అనువైన ప్రదేశాల్లో పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు జాబితా రూపొందించి ముసాయిదా విడుదల చేశారు. ఈ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించగా మంగళవారం తుది జాబితా విడుదల చేయనున్నామని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. ఈ జాబితాలను అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శిస్తామని ఆమె ఓ ప్రకటనలో వెల్లడించారు.

అసాధారణం



జిల్లాలో సాధారణ ప్రసవాల సంఖ్య నానాటికీ తగ్గుముఖం పడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యే తగ్గుతుండగా, వచ్చిన గర్భిణులకూ సాధారణ ప్రసవం చేయడంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మరోపక్క ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆజమాయిషీ లేకపోవడంతో సంపాదనే లక్ష్యంగా ఇక్కడ 80శాతం మేర శస్త్రచికిత్సలే చేస్తున్నారు. దీంతో మహిళలు అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకున్నట్లవుతోంది.

– ఖమ్మంవైద్యవిభాగం

ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలపై శ్రద్ధ కరువు

- జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్లు
- మహిళలకు ఇబ్బంది ఎదురవుతుందని తెలిసినా అటే మొగ్గు
- కిట్‌ రాక.. నగదు ప్రోత్సాహకాలు లేక నిరాశ

30శాతానికి తగ్గించాలని సూచించినా...

జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌తో పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలపైనే ప్రత్యేక దృష్టి సారించాలని, శస్త్రచికిత్సలను 30 శాతానికి తగ్గించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా అలా జరగడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా 50శాతం మేర శస్త్రచికిత్సలే జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నొప్పుల భయం, ముహూర్తం వంటి కారణాలతో గర్భిణులు, వారి కుటుంబీకులు శస్త్రచికిత్సలకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ కాన్పునకు వేచి ఉండాల్సి రావడం, గత ప్రభుత్వం అమలుచేసిన కిట్‌, ప్రోత్సాహక నగదు అందుబాటులో లేకపోవడం కూడా ఇందుకు ఓ కారణంగా తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణ కాన్పులపై వైద్యులు, సిబ్బంది కౌన్సెలింగ్‌ ఇస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. కాగా, గత మూడేళ్లుగా 50శాతం మేర సిజేరియన్లే నమోదవుతుండడం గమనార్హం.

కేసీఆర్‌ కిట్‌ పథకానికి మంగళం

కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక గతంలో అమలైన కేసీఆర్‌ కిట్‌ పథకాన్ని నిలిపివేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు గత తెలంగాణ ప్రభుత్వం 2017 జూన్‌ 2న ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం తొలి నాళ్లలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు కలుపుకుని ప్రసవాలు అంచనాకు మించి పెరిగాయి. ఈ పథకం ద్వారా రూ.2వేలు విలువైన సామగ్రితో కూడిన కిట్‌ అందించడమే కాక ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగపిల్లాడైతే రూ.12వేలు అందించేవారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టడంతో చాలా మంది ప్రైవేట్‌ ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా యాజమాన్యాలు విచ్చలవిడిగా శస్త్రచికిత్సలు చేస్తూ కాసులు దండుకుంటున్నాయి.

రెండున్నరేళ్లుగా ఎదురు చూపులు

గత ప్రభుత్వం అమలుచేసిన కిట్‌, నగదు ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయగా.. రెండున్నరేళ్లుగా నగదు సైతం విడుదల కావడం లేదు. జిల్లాలో 77,833 మంది లబ్ధిదారులకు 2022 జూలై నుండి 2024 నవంబర్‌ వరకు రూ.93,39,96,000 చెల్లించాల్సి ఉంది. మహిళ గర్భం దాల్చిన ఐదు నెలల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు సార్లు పరీక్ష చేయించుకుంటే మొదటి విడతగా రూ.3వేలు, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవిస్తే కిట్‌తో పాటు రెండో విడతగా ఆడపిల్ల పుడితే రూ.5వేలు, మగపిల్లాడు పుడితే రూ.4వేలు చెల్లించేవారు. అలాగే, ఇమ్యూనైజేషన్‌ మూడు డోసులను నాలుగు నెలల్లో పూర్తి చేస్తే మూడో విడతగా 2వేలు, బిడ్డపుట్టి తొమ్మిది నెలలు గడిచాక మిగతా నగదు అందేది. జిల్లాలో మొదటి విడతలో 15,917, రెండో విడతలో 13,917, మూడో విడతలో 24,548, నాలుగో విడతలో 23,451 మంది లబ్ధిదారులకు అందాల్సి ఉంది. అయితే, పథకమే నిలిచిపోవడంతో నగదు ఇస్తారా, లేదా అన్న అంశంపై స్పష్టత కరువైంది.

ప్రైవేట్‌లో ఇష్టారాజ్యం

ప్రైవేట్‌ ఆస్పత్రులపై అధికారుల ఆజమాయిషీ లేక డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ ఇష్టానుసారంగా సిజేరియన్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఈ ఆస్పత్రుల్లో 80 శాతం వరకు శస్త్రచికిత్సలే ఉంటున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కమీషన్లకు ఆశపడి ప్రైవేట్‌ ఆస్పత్రులకు రిఫర్‌ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ప్రసవానికి ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు బిల్లు వేస్తుండగా.. అధికారుల పట్టింపులేని తనంతో వారి వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలు అన్న చందంగా వర్ధిల్లుతోంది. ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో మధ్యలో సిజేరియన్లు కాస్త తగ్గినా మళ్లీ పాత పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలో కొన్నేళ్లుగా ప్రసవాల వివరాలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో...

ఏడాది	సాధారణం	సిజేరియన్లు	సిజేరియన్ల శాతం
2020-21	2,842	4,042	59
2021-22	3,247	4,305	57
2022-23	4,386	4,377	50
2023-24	3,840	3,827	50
2024-25 (ఇప్పటివరకు)	2,172	2,178	50

ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో...

ఏడాది	సాధారణం	సిజేరియన్లు	సిజేరియన్ల శాతం
2020-21	1,473	7,902	84
2021-22	1,350	7,946	85
2022-23	2,036	7,005	77
2023-24	1,595	6,525	80
2024-25 (ఇప్పటివరకు)	1,126	4,447	80

సిజేరియన్లు తగ్గించడంపై దృష్టి



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించేలా దృష్టి సారించాం. సాధారణ ప్రసవాలు పెంచేందుకు గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. సాధారణ ప్రసవమైతే తల్లికి భవిష్యత్‌లో ఇబ్బందులు ఉండదు. ఇక కిట్‌, నగదు ప్రోత్సాహక పథకం ప్రస్తుతం అందుబాటులో లేదు. అలాగే, ప్రైవేట్‌ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నాం.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

హోరాహోరీగా సీఎం కప్‌!



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న క్రీడాకారిణి, పక్కన డీవైఎస్‌ఓ తదితరులు

- తొలిరోజు ఏడు క్రీడాంశాల్లో పోటీలు
- జిల్లాస్థాయి పోటీలకు హాజరైన 870 మంది క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్‌: జిల్లాస్థాయి సీఎం కప్‌ క్రీడాపోటీలు ఖమ్మంలోని సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే పోటీల్లో భాగంగా తొలిరోజు ఏడు క్రీడాంశాల్లో నిర్వహించారు. ఈమేరకు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 870మంది హాజరు కాగా ఆయా అంశాల్లో హోరాహోరీగా తలపడ్డారు. వ్యక్తిగత, జట్లుగా క్రీడాకారులు తలపడుతుండగా వారి సహచరులు ఈలలు, కేకలతో ప్రోత్సహించడంతో సందడి నెలకొంది. కాగా, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి సీఎం కప్‌ పోటీలకు ఎంపిక చేయనున్నారు.

జిల్లా ఖ్యాతిని పెంచాలి..

సీఎం కప్‌ పోటీలను డీపీఆర్వో ఎం.డీ.గౌస్‌పాషా, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించగా జాతీయ స్థాయి క్రీడాకారులు జ్యోతి వెలిగించారు. అనంతరం డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ సత్తా చాటుతున్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని పెంచాలని సూచించారు. డీపీఆర్‌ఓ గౌస్‌పాషా మాట్లాడుతూ క్రీడల ద్వారా ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన వారిని వర్తమాన క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి, కోచ్‌లు ఎం.డీ.గౌస్‌, ఎం.డీ.అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు కరాటే, టేబుల్‌ టెన్నిస్‌, స్విమ్మింగ్‌, బాస్కెట్‌బాల్‌, కబడ్డీ, వాలీబాల్‌, రెజ్లింగ్‌ పోటీలు జరగగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించారు.



వాలీబాల్‌ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

విజేతలు వీరే...

జిల్లాస్థాయి సీఎం కప్‌ పోటీల్లో తొలిరోజు విజేతలను డీవైఎస్‌ఓ వెల్లడించారు. పురుషుల కబడ్డీలో కొణిజర్ల, నేలకొండపల్లి, వాలీబాల్‌లో కేఎంసీ, సత్తుపల్లి, బాస్కెట్‌బాల్‌లో పటేల్‌ స్టేడియం, పీవీఆర్‌ స్పోర్ట్స్‌ క్లబ్‌, బాలుర టేబుల్‌ టెన్నిస్‌లో కేఎంసీ, తనికెళ్ల, బాలికల విభాగంలో కేఎంసీ, ఖమ్మం రూరల్‌ జట్లు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. అలాగే, టీ.టీ. బాలుర సింగిల్స్‌లో పి.మోహిత్‌, కె.హితేష్‌, కేశవ, బాలికల్లో జి.సిరి, జి.చంద్రికరాణి, బి.సాయిశివాని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. కరాటేలో ఎన్‌.పార్థసారథి, కె.హరికృష్ణ, ఎం.డీ.అసదుద్దీన్‌, ఎ.వరుణ్‌, ఎన్‌.ప్రవీణ్‌, ఎస్‌.డీ.ఆదిల్‌పాషా, గోపతి గణేష్‌, ఆర్‌.నివాస్‌, బి.నితిన్‌, బి.సందీప్‌, ఆర్‌.బాలకృష్ణ, బాలికల విభాగంలో ఎం.లాస్యశ్రీ, జి.వెంకటసాయిశ్రీ, ఎన్‌.సంధ్య, ఎస్‌.కే.రిజాహర్‌, కె.నిఖిత, ఎస్‌.డీ.సల్‌హిన్‌, కె.కేతనా, ఎన్‌.శైలజ, సీహెచ్‌.అభినయశ్రీ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

జిల్లాకు నలుగురు ఏఎంవీఐలు

ఖమ్మంక్రైం: ఇటీవల అసిస్టెంట్‌ మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌(ఏఎంవీఐ)లుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న నలుగురిని జిల్లాకు కేటాయించారు. వీరిలో సుమలత, గోపీకృష్ణ సోమవారం ఇన్‌చార్జ్‌ ఆర్‌టీఓ వరప్రసాద్‌కు రిపోర్ట్‌ చేయగా వారికి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలోనే విధులు కేటాయించారు. మరో ఇద్దరైన రవిచంద్ర, దినేష్‌ ఒకటి, రెండు రోజుల్లో రిపోర్ట్‌ చేయనుండగా వైరా, సత్తుపల్లి రవాణా శాఖ కార్యాలయాల్లో విధులు కేటాయించే అవకాశం ఉంది.

ముక్కోటికి రండి

- దేవాదాయ శాఖ మంత్రికి ఈఓ ఆహ్వానం
- ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ, అధికారులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా జనవరి 10వ తేదీ తెల్లవారుజామున జరిగే ఉత్తర ద్వార దర్శనానికి రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ ఈఓ ఎల్‌.రమాదేవి ఆహ్వాన పత్రిక అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్‌ కార్యాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజా రామయ్యర్‌, కమిషనర్‌ శ్రీధర్‌, కూరాకుల జ్యోతి తదితరులతో కలిసి ఈఓ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మంత్రి సురేఖకు వేదాశ్వీరచనం చేయగా ఈఓ స్వామివారి ప్రసాదం అందించారు. అనంతరం వైకుంఠ ప్రయుక్త ముక్కోటి అధ్యయనోత్సవాల వాల్‌ పోస్టర్లు, కరపత్రాలను మంత్రి సురేఖతో పాటు అధికారులు ఆవిష్కరించారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం..

భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆండాళ్‌ అమ్మవారికి తిరువీధి సేవ నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా ప్రతీ రోజు పండితులు ఆలయంలో తిరుప్పావై ప్రవచనం చేయనున్నారు. 27వ రోజున కూడారై ఉత్సవాన్ని కనులపండువగా జరుపుతారు. చివరి రోజున గోదాదేవి – శ్రీరంగనాథ స్వామి వార్ల తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తారు.



ఆండాళ్‌ అమ్మవారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ముత్తంగి అలంకరణలో రామయ్య..

అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుక తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, అధికారులు

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు

- ఎప్పటికప్పుడు పరిశీలన, పరిష్కారం
- 'ప్రజావాణి'లో కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

ఖమ్మం సహకారనగర్‌: ప్రజలు అందించిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజతో కలిసి ఆయన ప్రజల నుండి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఏమైనా కారణాలతో తిరస్కరిస్తే ఆ విషయాన్ని దరఖాస్తుదారులకు తెలపాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కోసం వినతి

ఖమ్మం రూరల్‌ మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిశారు. కురవి – కోదాడ రహదారి విస్తరణలో తన ఇంట్లో ఓ గది కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఈమేరకు నాలుగు గదుల ఇంటితో పాటు స్టాల్‌ ఏర్పాటుకు పై అంతస్తులో మరో గది నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్‌ పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.



వనజీవి రామయ్య ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

ఫిర్యాదులు ఇంకొన్ని..

- డోర్నకల్‌ – భద్రాచలం రోడ్డు రైలు మార్గంలో డబ్లింగ్‌ లైన్‌ నిర్మాణానికి నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు, స్థలాలు, పొలాల సేకరణకు యత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. పరిహారం చెల్లించాకే భూసేకరణ చేపట్టాలని నిర్వాసితులు ముక్కా వెంకటమహేష్‌, ముండ్ల ఏకాంబరం, షేక్‌ హుస్సేన్‌బీ, తొగర శ్రీను, సోమందుల వెంకటేశ్వర్లు, వీరమ్మ తదితరులు కోరారు.
- కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన చింతలపాటి చెన్నారావు మన ఊరు – మన బడి పథకం క్రింద తల్లాడ మండలం కుర్నవల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని కోరారు. పాఠశాలలో రూ.45 లక్షల విలువైన పనులు చేయగా రూ.10 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.
- ఖమ్మం మదీనా మసీదు అధ్యక్షుడు ఎం.డీ.హకీం ముస్తఫానగర్‌ ఏరియాలోని మైనార్టీ ఖబరస్తాన్‌కు భూమి కేటాయించాలని కోరారు.
- ముదిగొండ మండలం వల్లభికి చెందిన కృష్ణవేణి తమ గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్‌ పోస్ట్‌ కల్పించాలని కోరారు.

బాలల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్‌

ఖమ్మంవన్‌టౌన్‌: బాలల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా చేపడుతున్న పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ ఆదేశించారు. బాలల సదనాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆయన చేపట్టాల్సిన పనులు, పిల్లల ఆహ్లాదం కోసం సమకూర్చాల్సిన పరికరాలపై సూచనలు చేశారు. ఖాళీస్థలంలో ఉన్న బండలను తొలగించి భూమి చదును చేశాక ఆటపరికరాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. అలాగే, భవనం గోడలపై పిల్లలను ఆకట్టుకునేలా బొమ్మలు వేయించాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి, సదనం సూపరింటెండెంట్‌ వరలక్ష్మి పాల్గొన్నారు.

టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సత్తుపల్లి/ఖమ్మం సహకారనగర్‌: టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా నూతన కార్యవర్గాన్ని సత్తుపల్లిలో రెండు రోజుల పాటు జరిగిన మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్‌ రంజాన్‌, పారుపల్లి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా బుర్రి వెంకన్న, షమీ, కోశాధికారిగా వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులుగా ఎం.నర్సయ్య, డి.నాగేశ్వరరావు, వీ.వీ.రామారావు, కె.నిర్మలాకుమారి, పి.సురేష్‌, బి.రాందాస్‌, ఎస్‌.కే.నాగూర్‌వలీ, ఎస్‌.కే.ఉద్దండు, కె.పద్మ, సీహెచ్‌.రోజా, జి.రామకృష్ణ, ఏ.కోటేశ్వరరావు, డి.ఉమామహేశ్వరరెడ్డి, కె.విజయ్‌కుమార్‌, ఎన్‌.సుధాకర్‌రావును ఎన్నుకున్నారు. అంతేకాక 119 మంది జిల్లా కమిటీ సభ్యులుగా, 19 మంది ఆఫీస్‌ బేరర్లుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, పరిశీలకులుగా చావా దుర్గాభవాని వ్యవహరించారు. ఈసందర్భంగా సోమవారం ఖమ్మంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులు రంజాన్‌, నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్ల పాటు నూతన కమిటీ అమల్లో ఉంటుందని తెలిపారు. కాగా, జిల్లా మహాసభల్లో పలు తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు.



రంజాన్‌, నాగేశ్వరరావు

క్లుప్తంగా

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం


మాట్లాడుతున్న జీఎం నారాయణరావు

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో ప్రతీ ఉద్యోగి, కార్మికుడు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆర్అండ్ డీ జీఎం ఆర్.నారాయణరావు సూచించారు. సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో రక్షణ కమిటీ బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా ట్రేడ్ పరీక్షల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందించాక జీఎం మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం మేర బొగ్గుఉత్పత్తి సాధనపై దృష్టి సారించడమే కాక రక్షణ సూత్రాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓ నర్సింహారావు, వివిధ విభాగాల ఉద్యోగులు, నాయకులు ఎస్.సుధాకర్‌రావు, బాలాజీ, సునీల్ వర్మ, రామకృష్ణ, లక్ష్మీరాజు, భాస్కర్, లోక్‌నాథ్‌రెడ్డి, శ్రీరాం, తిరుపతి, కిషన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, రమణారావు, రామకృష్ణ, గోపికిషోర్, విజయ్ సందీప్ పాల్గొన్నారు.

19న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. 75 కేజీల లోపు బరువు కలిగిన బాలురు, 65 కేజీలల్లోపు బరువు బాలికలు అర్హులని, వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే బాలుర జిల్లా జట్టు మేడ్చల్‌లో, బాలికల జట్టు జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. వివరాల కోసం 73966 69337 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు రోహిత్‌శర్మ

కామేపల్లి: మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మండలంలోని పండితాపురానికి చెందిన వంగివరపు రోహిత్‌శర్మ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ జట్టు ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఈనెల 26 నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ప్రస్తుతం రఘునాథపాలెం మండలం బూడిదంపాడులోని లిటిల్ బర్డ్స్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రోహిత్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

కష్టమైనదే ముందు చదవండి..

సత్తుపల్లి: ఇష్టమైనది మాత్రమే నిరంతరం చదివితే కష్టమైన సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించడం కష్టమవుతుందని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. సత్తుపల్లిలోని గంగారంలో దాసరి వీరారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక ఆయన మాట్లాడారు. కష్టమైన సబ్జెక్టుల్లో పాఠాలను సైతం అర్థం చేసుకునేలా చదివితే ఇష్టం పెరుగుతుందన్నారు. తద్వారా అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించొచ్చని తెలిపారు. శ్రద్ధగా వినడం, చదవడమేకాక రాయడం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె


దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద వారి దీక్షా శిబిరాన్ని సోమవారం వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, కల్యాణం వెంకటేశ్వరరావు, రామాంజనేయులు తదితరులు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఝాన్సీ సౌజన్య, మహబూబ్ పాషా, ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ సోమవారం రాత్రి మృతి చెందింది. పెనుబల్లి మండలానికి చెందిన వాడపల్లి కనకమ్మ(46) గర్భసంచి సమస్యతో బాధపడుతుండగా వారం క్రితం ఇక్కడి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. మంగళవారం ఆమెను డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పగా సోమవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందింది. ఈ ఘటనతో ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. అయితే, కనకమ్మ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, ఆమెకు భర్త బాలస్వామి, కుమార్తె ఆకాంక్ష, కుమారుడు రాజేష్ ఉన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- రెండో రోజూ ప్రశాంతం
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


పీజీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు సోమవారం ముగిశాయి. ఆది, సోమవారాల్లో రెండేసి సెషన్లలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న 28,101 మంది అభ్యర్థుల కోసం 85 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్షకు 8-30 నుంచి 9-30 గంటల వరకు, మధ్యాహ్నం 1-30 నుంచి 2-30 గంటల వరకు మాత్రమే అనుమతించారు. తొలిరోజు కొన్నిచోట్ల ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించకపోవడంతో సోమవారం దాదాపు అభ్యర్థులంతా ముందస్తుగానే కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయడమే కాక అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించాకే లోపలికి అనుమతించారు. కాగా, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలతో పాటు ఇంకొన్ని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించి ఉద్యోగులకు సూచనలు చేశారు.

కేంద్రాల ఆవరణలోనే భోజనం

ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో గ్రూప్-2 పరీక్షలు జరగగా వివిధ ప్రాంతాల అభ్యర్థులు ఉదయమే కేంద్రాలకు చేరుకున్నారు. కొందరు కుటుంబ సభ్యులు, చంటిపిల్లలతో కలిసి రాగా అభ్యర్థులు హాల్‌లోకి వెళ్లగా వారి బంధువులు కేంద్రాల సమీపాన సేదతీరుతూ కనిపించారు. ఇక ఉదయం పరీక్ష ముగిశాక విరామ సమయంలో కేంద్రాల వద్దే భోజనం చేసి రెండో పరీక్షకు హాజరయ్యారు.


పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల వివరాలు పరిశీలిస్తున్న ఉద్యోగులు

మన జిల్లాలో ఉద్యోగం కోసం...



ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2010లో హోంగార్డుగా విధుల్లో చేరా. రాష్ట్ర విభజన సమయాన ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లడంతో మళ్లీ ఇక్కడకు రావడం సాధ్యం కావడం లేదు. మ్యూచువల్‌గా ఏపీకి వెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో సొంత జిల్లాలో ఉద్యోగం సాధించొచ్చని గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యా.

– ఎస్.కే.నాగుల్‌మీరా, కోరట్లగూడెం, నేలకొండపల్లి మండలం

కొన్నాళ్లుగా సిద్ధమవుతున్నా...



ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కొన్నాళ్లుగా గ్రూప్-2 తదితర ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఉన్నత విద్య పూర్తిచేయగా.. ఇప్పటికే ఉద్యోగాలకు సంబంధించి కొన్ని పరీక్షలు రాశాను. పరీక్షలో కొన్ని ప్రశ్నాపత్రాలు కఠినంగా వచ్చాయని చెబుతున్నారు. కానీ పట్టుదలతో చదవడంతో పెద్ద కష్టమేమీ అనిపించలేదు.

– చికోటి మనోహర్, భరణిపాడు, సత్తుపల్లి మండలం

■ నువ్వా.. నేనా..!

సీఎం కప్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే పోటీల్లో భాగంగా తొలిరోజు కరాటే, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, రెజ్లింగ్ పోటీలు జరిగాయి. వివిధ మండలాల నుంచి 870మంది క్రీడాకారులు పాల్గొనగా నువ్వా, నేనా అన్నట్లు తలపడ్డారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, అధికారులు


బాలుర స్విమ్మింగ్ పోటీ



బాస్కెట్‌లో బంతి వేస్తున్న బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, కబడ్డీలో పాయింట్ కోసం ప్రయత్నిస్తూ..

రేపటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా 22వ మహా సభలు సత్తుపల్లిలో ఈనెల 18, 19వ తేదీల్లో జరగనున్నాయని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలి పారు. ఈ మహాసభలకు 600మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారని చెప్పారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ ఉద్యమాల రూపకల్పనకు మూడేళ్లకోసారి గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు నిర్వహించి, నూతన కార్యవర్గాలు ఎన్నుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జరగనున్న జిల్లా మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వీ. రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు ఎస్.వీరయ్య, బి.వెంకట్, పోతినేని సుదర్శన్, సాయిబాబు తదితరులు హాజరవుతారని అన్నారు. మహాసభల ప్రారంభానికి ముందు సత్తుపల్లి డివిజన్ కార్యాలయం నుంచి మహాసభల ప్రాంగణం వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ సభల్లో ప్రజల సమస్యలు, పాలకుల విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమ సంక్షోభం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపన, ఖమ్మంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిమ్స్ తరహా వైద్య కళాశాల, ఆరు గ్యారంటీల అమలుపై తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, నెల్లూరి వీరబాబు పాల్గొన్నారు.

రుణమాఫీపై ప్రభుత్వానిది తప్పుడు ప్రచారం

- తక్షణమే రైతు భరోసా అమలు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు హేమంతరావు



రఘునాథపాలెం తహసీల్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న హేమంతరావు

రఘునాథపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: రూ.2లక్షల్లోపు రుణాలు ఉన్న రైతులకు మాఫీ వర్తించకుండానే ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా 50 శాతం మందికి మాఫీ అయిందన్నారు. జిల్లాలోని రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం జరిగిన ధర్నాల్లో ఆయన మాట్లాడారు. పాస్ పుస్తకాలు లేవని, కుటుంబ సభ్యుల సంఖ్య సరిపోలలేదని రుణమాఫీ నిలుపుదల చేశారని, మరణించిన రైతుల కుటుంబాలకూ వర్తింపచేయలేదని తెలిపారు. అలాగే, రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం వాయిదాలు పెట్టడం సరిదన్నారు. ఇకనైనా రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేయడంతో పాటు రైతుభరోసా నిధులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న రైతాంగ పోరాటంపై నిర్బంధాన్ని నిలిపివేయాలన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28 నుండి అమలు చేయనున్న ఆర్థిక చేయూత పథకాన్ని భూమిలేని ప్రతీ పేదకు అందేలా చర్యలు తీసుకోవాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ నాయకులు మహ్మద్ మౌలానా, మిడికంటి చిన్న వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, ఎస్.కే.జానీమియా, మహ్మద్ సలాం, పగడాల మల్లేష్, శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎస్.కేసైదా, జ్వాలా నర్సింహారావు, బాగం ప్రసాద్, చీనా, జామ్లా, లక్ష్మా, మంగ్యా, సురభి శ్రీను, నాగా, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

కట్లేరు నుంచి ఇసుక తరలింపునకు అనుమతి


రేవును పరిశీలించి మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడులోని కట్లేరు నుంచి ఇసుక తరలింపునకు అనుమతి లభించింది. స్థానిక అవసరాలకు ఇసుక కొరత ఎదురవుతోందని పలువురు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచనలతో మహిళా సంఘాల ద్వారా ఇసుక రవాణాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ ఎం.ఉషాశారద, మైనింగ్ ఆర్ఐ నాగరాజు ఇసుక రేవును ప్రారంభించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతి లభించిందని తెలిపారు. ఇదేసమయాన అక్రమ రవాణాకు అవకాశం లేకుండా ఐకేపీ సిబ్బంది పర్యవేక్షిస్తారని చెప్పారు. ఐకేపీ ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, జియోలజిస్టులు సంతోష్, ప్రమోద్ నర్సింహారావు, సీసీ శాంతకుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు నాయకులు శీలం ప్రతాపరెడ్డి, ముక్కర రామకృష్ణారెడ్డి, అయిలూరి రవీందర్‌రెడ్డి, బండారు నర్సింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి, గుడేటి బాబూరావు, రాజీవ్‌గాంధీ పాల్గొన్నారు.

కార్యదర్శికి చార్జ్ మెమో జారీ

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామ కార్యదర్శిగా గతంలో విధులు నిర్వర్తించిన వెంకటరమణకు జిల్లా పంచాయితీ అధికారి సోమవారం చార్జ్ మెమో జారీ చేశారు. ఈవిషయాన్ని ఎంపీఓ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం కిష్టారం గ్రామకార్యదర్శిగా పనిచేస్తున్న వెంకటరమణ పాపటపల్లిలో పని చేసిన సమయాన పలు ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈమేరకు విచారణ చేపట్టిన ఎంపీఓ నివేదిక అందజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ నిమిత్తం వెంకటరమణకు డీపీఓ చార్జ్ మెమో జారీ చేసినట్లు తెలిసింది.

గన్నీబ్యాగ్‌ల కొరత రావొద్దు

ఏన్కూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌ల కొరత ఎదురుకాకుండా ముందస్తుగా సమకూర్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. మండలంలోని తిమ్మారావుపేట, ఏన్కూరు, బురదరాఘవాపురంల్లో ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేసారు. అలాగే, లచ్చగూడెం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడగా బస్తాలు లేకపోవడంతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని డీఏఓకు చెప్పారు. దీంతో స్పందించిన ఆయన సివిల్ సప్లయీస్ అధికారులతో మాట్లాడగా మంగళవారం నాటికి బస్తాలు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ నర్సింహారావు, ఏఈఓలు బాలకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

నిండుకుండలా తాలిపేరు


నిండా నీటితో కళకళలాడుతున్న తాలిపేరు ప్రాజెక్టు (ఇన్‌సెట్) 74మీటర్లుగా నమోదైన నీటిమట్టం

ప్రాజెక్టులో 74 మీటర్ల మేర పూర్తి స్థాయి నీటిమట్టం

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. వర్షాకాలం ముగిసి మూడు నెలలు కావొస్తుండటం, ఖరీఫ్ సీజన్‌లో చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని పొలాలకు సాగునీరు విడుదల చేసినా డిసెంబర్ ఆఖరుకు ప్రాజెక్టులో 74మీటర్ల మేర పూర్తిస్థాయి నీటిమట్టం నమోదు కావడం విశేషం. ఎగువ నుంచి కొద్దిమేర వస్తున్న ఇన్‌ఫ్లోను ఒడిసి పడుతూనే కుడి, ఎడమ ప్రధాన కాల్వ ద్వారా ఖరీఫ్ పంటలకు సాగునీరు విడుదల చేశారు. ఇదే సమయాన ఖరీఫ్ చివరి నాటికి సైతం పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండేలా ప్రయత్నించి సఫలమైన ప్రాజెక్టు అధికారులను రైతాంగం అభినందిస్తోంది. కాగా, జలకళను సంతరించుకున్న ప్రాజెక్టు అందాలను వీక్షించేందుకు సమీప గ్రామాలతో పాటు దుమ్ముగూడెం, వెంకటాపురం, భద్రాచలం ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు.

కల్యాణలక్ష్మి అక్రమార్కులపై విచారణ

నకిలీ ధ్రువపత్రాలపై పోలీసుల ఆరా.. సీపీకి నివేదిక


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఉద్యోగి

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా నగదు కాజేసేందుకు నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా జరిగిన విఫలయత్నంపై విచారణ కొనసాగుతోంది. వరుడు, వధువుగా పెనుబల్లి మండలానికి చెందిన సోమ్లానాయక్, అదే మండలానికి చెందిన ఓ యువతి పేరుతో వారి బంధువు వెంకన్న వైరాలోని ఉపేందర్‌తో కలిసి కొద్దిరోజుల క్రితం నకిలీ ఆహ్వాన పత్రిక, ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, వివాహ ధ్రువీకరణ పత్రం సృష్టించి తహసీల్‌లో దరఖాస్తు చేసుకున్న విషయం విదితమే. అయితే, రెవెన్యూ ఉద్యోగులు కనీస విచారణ కూడా చేయకుండా దరఖాస్తును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పంపించారు. అక్కడ క్యాంపు కార్యాలయ ఉద్యోగి గుగులోత్ రాము పత్రాలన్నీ నకిలీవని గుర్తించి ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేయగా వైరా సీఐ సాగర్ ఆధ్వర్యాన విచారణ చేస్తున్నారు. అంతేకాక నివేదికను ఇప్పటికే పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌కు సమర్పించినట్లు తెలిసింది. కాగా, తల్లాడలో నకిలీ వివాహపత్రిక ముద్రించడం, వైరాలో ఓ ప్రజాప్రతినిధి ఆకుపచ్చ రంగు పెన్నుతో సంతకం చేసి ఫార్వర్డ్ చేయడం.. ఆపై తహసీల్ ఉద్యోగులు విచారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈనేపథ్యాన విచారణ అనంతరం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయాన బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిని కేసు తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

కుటుంబం చెంతకు చేరిన వృద్ధురాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చి దారి తప్పిన వృద్ధురాలిని చేరదీసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతలబోరుకు చెందిన 70ఏళ్ల వృద్ధురాలు సిద్దుల ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు ఈనెల 10న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, 12వ తేదీన ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన ఆమె తప్పిపోగా ఖమ్మం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఖమ్మం టేకులపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఆమె ఒంటరిగా తిరుగుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆమెను చేరదీసి అన్నం ఫౌండేషన్‌లో అప్పగించారు. అక్కడ ఆరా తీయగా ఈశ్వరమ్మ కుటుంబం వివరాలు చెప్పడంతో సోమవారం వారిని పిలిపించి అప్పగించారు.

చెత్తకుప్పకు నిప్పు.. ఎగిసిపడిన మంటలు


కాలిపోతున్న తీగలు

ఖమ్మంఅర్బన్/ఖమ్మం క్రైం: ఖమ్మం ఇందిరానగర్ జంక్షన్‌లో విద్యుత్ హైటెన్షన్ తీగలు వెళ్లే స్తంభం వద్ద చెత్తకు నిప్పంటించడంతో మంటలు ఎగిసిపడి స్తంభానికి కట్టిన ఇంటర్‌నెట్, కేబుల్ టీవీ వైర్లు కాలిపోయాయి. సోమవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడడంతో దుకాణదారులు, వాహనదారులు ఆందోళన చెందారు. ఈమేరకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. సమీపంలోని దుకాణదారులు వేసిన చెత్త వద్ద చలి నుంచి ఉపశమనం కోసం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది. మంటల కారణంగా ఇంటర్నెట్, కేబుల్ టీవీ వైర్లు కాలిపోవడంతో ఈ ప్రాంతంలో మధ్యాహ్నం వరకు సేవలు నిలిచిపోయాయి.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సత్తుపల్లికి చెందిన గోడ శ్రీనివాసరావు సోమవారం ఖమ్మం వచ్చి తిరిగి వెళ్లేందుకు పాత బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఆయన బస్సు ఎక్కుతుండగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బండి సత్యనారాయణ సెల్‌ఫోన్ చోరీ చేసి వెళ్లిపోయాడు. కాసేపటికి గమనించిన బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా వారు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

రఘునాథపాలెం: మండలంలోని మంగ్యాతండాకు చెందిన వివాహిత ఇచ్చిన ఫిర్యాదుతో ఆమె భర్తపై ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదైంది. మంగ్యాతండాకు చెందిన బి.సీతారాములు నిత్యం మద్యం మత్తులో వేధిస్తున్నాడని ఆయన భార్య వీరమ్మ పోలీసులను ఆశ్రయించింది. దీంతో సీతారాములపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఏటిలో పడి వలస కూలీ మృతి

బోనకల్: ప్రమాదవశాస్తు వైరా ఏటిలో పడిన వలస కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో జరిగింది. ఎస్ఐ మధుబాబు తెలిపిన వివరాలు... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీర్‌సింగ్(55) కూలి పనుల కోసం గ్రామానికి వచ్చాడు. ఆయనతో పాటు మరికొందరు వైరా ఏటి పక్కన గుడిసెలు వేసుకున్నారు. ఈనెల 14న స్నానం చేయడానికి ఏటి వద్దకు వెళ్లిన బీర్‌సింగ్ గుంతలో పడిపోయాడు. చాలాసేపటి వరకు ఆయన రాకపోవడంతో కుమారుడు సుకుల్‌సింగ్ ఫిర్యాదుతో పోలీసులు గాలిస్తుండగా సోమవారం ఆయన మృతదేహం బయటపడింది. ఈమేరకు మృతదేహానికి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన పోలీసులు ఆతర్వాత కుటుంబీకులకు అప్పగించారు.